

ఎండుతెగులు సోకిన మిరప మొక్క

# మిర్చికి వైరస్

## మిరప పంటపై తుఫాను ప్రభావం.. పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

- ఎండిపోతున్న మిర్చి పంట
- సోకుతున్న ఆకుముడత, తలమాడు తెగుళ్లు
- ఆందోళనలో రైతులు



నర్సింహులపేట, డిసెంబర్ 10 : తుఫాను ప్రభావంతో వాతావరణంలో కలుగుతున్న మార్పులు మిరప పంటపై ప్రభావం చూపుతున్నాయి. వివిధ రకాల తెగుళ్లు వ్యాపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం నుంచీ రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో మొక్కల్లో పెరుగుదల నిలిచిపోతున్నది. మొదట్లో ఏపుగా పెరిగాయని ఆనందపడ్డ రైతులు, కాయదశలో చెట్టుకొమ్మలు పూర్తిగా ఎండిపోయి కాయలు చేతికొచ్చే అవకాశం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించలేదని, ఎలాంటి సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఎకరం మిరప పంట సాగుకు రూ.30వేల దాకా ఖర్చు వస్తుండగా పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరపలో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, తామర, పేనుబంక, నల్లి ఉధృతి పెరుగుతున్నది.



### ఆకుముడత (జెమిని వైరస్)

ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు ముడత పడి పసుపు వర్ణంలోకి మారి గిడసబారి పోతాయి. మొక్కల్లో ఆకుల మధ్య కణుపుల దూరం తగ్గి ముడుచుకుంటాయి. ఈ వైరస్ తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. నివారణకు ట్రయజోఫాస్ అనే మందు 1.25 ఎంఎల్‌ను లీటర్ నీటిలో లేదా ఎసిటామాప్రైడ్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



ముడత సోకిన మిరప మొక్కలు

### తలమాడు..

ఈ తెగులుతో మిరప మొక్క మొవ్వు లేదా చిగురు భాగం ఎండిపోతుంది. ఆకులపై నలటి మచ్చలు ఎర్పడి పండుబారి రాలిపోతుంది. ఇది తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. దీని నివారణకు పిప్రోనిల్ 2గ్రాములు లేదా థయోమిథాకానిమ్ 0.2 గ్రాములు లేదా క్లోరోఫినాపైర్ 2గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



తెగులు ఆశించిన మిర్చి తోట

### కుకుంబర్ మొజాయిక్ వైరస్..

మిరప మొక్కల ఆకుల పాలిపోయి లేత ఆకుపచ్చ రంగుకు మారుతాయి. ఆకులు సన్నబడి పసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. ఈ తెగులు పేనుబంక ద్వారా వ్యాపిస్తుంది. దీని వివారణకు ఎసిఫెట్ రెండు గ్రాములు లేదా ఫ్రైడ్ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి.

### నివారణకు చర్యలు తీసుకోవాలి

గట్టపై కలుపు లేకుండా చూసుకోవాలి. పురుగు మందులు పిచికారీ చేసినప్పుడు తప్పనిసరిగా గట్టపై మందు పిచికారీ చేసుకోవాలి. వైరస్ ఎక్కువ సోకితే ఆ మొక్కలను పీకి దూరంగా తగలబెట్టాలి. పురుగు మందులు వాడేటప్పుడు తప్పని సరిగా పురుగుమందుతో పాటు వేప సంబంధిత కషాయం లేదా నూనెల మిశ్రమాన్ని కలిపి వాడడం వల్ల సమర్థవంతగా నివారించవచ్చు.

- సీహెచ్ రాకేశ్, తొర్రూరు డివిజన్ ఉద్యానశాఖాధికారి



పర్యాటకులతో కోలాహలంగా లక్నవరం వేలాడే వంతెన

# సండే సందడి

**లక్నవరం, రామప్పలో పర్యాటకుల రద్దీ**
**బోట్లలో షికారు.. సెల్ఫీ తీసుకొని సంబురం**
**సరస్సు అందాలు, ఆలయ శిల్పకళకు ఫిదా**

గోవిందరావుపేట/వెంకటాపూర్, డిసెంబర్ 10 : పర్యాటక ప్రాంతమైన లక్నవరం సరస్సు పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కిటకిటలాడింది. మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని తిరుగు ప్రయాణంలో సాయంత్రం వేళలో లక్నవరం చేరుకొని వేలాడే వంతెనలపై నడుస్తూ బోట్లలో షికారు చేశారు. ఈ సందర్భంగా సరస్సు అందాలను తిలకించి సెల్ఫీ, ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. అలాగే ములుగు జిల్లాలోని రామప్ప ఆలయం భక్తులతో సందడిగా కనిపించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ర్టాల నుంచి వేలాది మంది పర్యాటకులు, విద్యార్థులు, భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తాడ్వాయిలోని గిరిజన పాఠశాలకు చెందిన వనవాసీ ఆశ్రమ నిలయ ప్రముఖ్ ఆకుల సాంబయ్య ఆధ్వర్యంలో 50 మంది వనవాసీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజరులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆ తర్వాత రామప్ప సరస్సుకు చేరుకొని పర్యాటక శాఖ బోట్లలో షికారు చేసి ఆహ్లాదంగా గడిపారు.



లక్నవరంలో స్పీడ్ బోటులో షికారు చేస్తున్న పర్యాటకులు



రామప్పలో నందీశ్వరుడి వద్ద వనవాసీ విద్యార్థులు



లక్నవరంలో పెద్ద బోటులో ప్రయాణిస్తున్న పర్యాటకులు



తన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లో రాగులను ప్రాసెసింగ్ చేస్తున్న రజిత

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జడల్‌పేట గ్రామానికి చెందిన కొమురవెల్లి రజిత, రాజు దంపతులది వ్యవసాయ కుటుంబం. గ్రామంలో వారికి నాలుగెకరాల భూమి ఉంది. సేద్యం చేసుకుంటూ జీవనం గడుపుతుంటారు. వ్యవసాయంతో మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి సారించాలని రజిత ఆలోచించింది. కాగా రజిత స్వయం సహాయక సంఘం(శ్రీ భవాని మహిళా పొదుపు సంఘం)లో 20ఏళ్లుగా చురుకుగా పనిచేస్తున్నది. మహిళా సంఘాల ద్వారా వచ్చే అదనపు రుణాల గురించి అధ్యయనం చేసింది. సర్కారు అందించే సంఘాల రుణాల సాయంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసుకుని వ్యాపారం మొదలుపెట్టాలని భావించింది. డీఆర్‌డీఏలోని సీసీ, ఏపీఎం, డీపీఎంలను సంప్రదించి వివరాలు సేకరించింది. స్త్రీనిధి, పీఎం ఎఫ్‌ఎంఈ, మండల సమాఖ్య, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకుని యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

- జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ)



## సరికొత్త ఆలోచనతో మారిన తలరాత

- నాలుగు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- చేయూతనిచ్చిన గత ప్రభుత్వ సాయం
- రాగి, గోధుమ, బియ్యపు పిండి, కారంపొడి తయారీ
- ప్యాకింగ్‌లతో పట్టణాలకు సరఫరా
- ఫ్లిప్‌కార్ట్ ఆర్డర్లకు సైతం దరఖాస్తు
- జయశంకర్ జిల్లా జడల్‌పేట మహిళా రైతు రజిత విజయగాథ

# స్వయం రుణం.. ఉపాధి ఘనం

### తొలుత రెండు యూనిట్లతో..

మొదట స్త్రీనిధి ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పి విజయవంతంగా కొనసాగించింది రజిత. ఆ తర్వాత భవాని మహిళా పొదుపు సంఘం నుంచి వచ్చిన రూ.80వేల రుణంతో కిరాణా షాపు పెట్టింది. అంతటితో ఆగకుండా వ్యాపారాన్ని మరింత విస్తరించాలని భావించి డీఆర్‌డీఏ అధికారుల సాయంతో పీఎం ఎఫ్‌ఎంఈ(ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్) ద్వారా రూ.2.83లక్షల రుణం తీసుకుంది. అలాగే మండల సమాఖ్య నుంచి రూ.40వేల రుణం తీసుకుని మరో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పింది. మొత్తం నాలుగు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రాగి, గోధుమ, బియ్యం పిండి, పసుపుతో పాటు కారం పొడి తయారీ చేస్తూ ప్యాకింగ్ ద్వారా విక్రయాలు జరుపుతున్నది. మరో వైపు కిరాణ షాపును విజయవంతంగా నడిపిస్తున్నది.



తన రెండో కిరాణా షాపులో తయారు చేసిన ఉత్పత్తులతో రజిత, భర్త రాజు

### పండించిన రాగులతోనే..

రజిత-రాజు దంపతులకు ఉన్న నాలుగు ఎకరాల భూమిలో రెండు ఎకరాల్లో రాగులు పండిస్తున్నది. పండించిన పంట ద్వారా వచ్చిన రాగులను ప్రాసెసింగ్ చేస్తూ వినియోగదారులకు విక్రయిస్తున్నది. అలాగే పరకాల, వరంగల్ నుంచి గోధుమలు, బియ్యం, పసుపు కొమ్ములు బల్క్‌గా కొనుగోలు చేసి తెచ్చుకుని వాటిని ప్రాసెసింగ్ చేస్తూ ప్యాకెట్ల ద్వారా గోధుమపిండి, బియ్యం పిండి, పసుపు విక్రయాలు చేస్తున్నారు. భూపాలపల్లితో పాటు చెల్పూరు, పరకాల, చిట్యాల తదితర పట్టణాల్లోని హోటళ్లకు ఆర్డర్ ప్రకారం సరఫరా చేస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా అన్ని ఖర్చులు పోను నెలకు రూ.15వేలకు పైనే మిగులుతున్నాయని రజిత చెబుతోంది. దీనికి తోడు కిరాణం, వ్యవసాయం ఆర్థికంగా సపోర్టు చేస్తున్నాయని తెలిపింది.

### అవగాహనతోనే సాధ్యమైంది..

20ఏళ్లుగా నేడు మహిళా సంఘాల్లో పనిచేస్తున్నా. కానీ గత 10ఏళ్లలోనే మహిళా సంఘాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ప్రత్యేకంగా రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నది. గత ప్రభుత్వ సాయంతోనే వ్యాపారం ఏర్పాటు చేసుకుని సంతోషంగా ఉన్నం. కుమారుడు, కుమార్తెను మంచిగ చదివిస్తున్న. డీఆర్‌డీఏ అధికారులు మేము తయారు చేస్తున్న ప్రొడక్ట్స్‌ను తీసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్‌కు దరఖాస్తు చేశాను. అనుమతి వస్తే ఫ్లిప్‌కార్ట్ ద్వారా మేము తయారు చేసే ఉత్పత్తులు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాం. మహిళా సంఘాల ద్వారా ఎలాంటి రుణాలు తీసుకోవచ్చనే విషయంపై స్టడీ చేశాను. ఇన్ని రకాల రుణాలు తీసుకోవచ్చా అని సీసీలు, ఏపీఎంలు చెప్పిన రుణాల వివరాలపై ఆశ్చర్యపోయా. స్త్రీనిధి, స్వయం సహాయక సంఘాలు, పీఎం ఎఫ్‌ఎంఈ నుంచి రుణాలు తీసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నా.

- కొమురవెల్లి రజిత, నిర్వాహకురాలు



ప్యాకింగ్ చేసిన ఉత్పత్తులు